ఏడోసారి అధికారంలోకి వస్తాం

● సర్వసభ్య మండలిలో స్టాలిన్ ధీమా


ప్రసంగిస్తున్న డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్

చెన్నై, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): గత నాలుగేళ్లుగా డీఎంకే ద్రావిడ తరహా పాలనను అందిస్తున్న తమ ప్రభుత్వం అమలు చేసిన విప్లవాత్మకమైన, దేశానికి ఆదర్శవంతంగా నిలిచే పథకాలపై ప్రజల నుండి మంచి స్పందన వస్తోందని, తమ పాలనపై రోజురోజుకూ ప్రజాదరణ పెరుగుతోందని, అవన్నీ పరిగణనలోకి తీసుకుంటే ఏడోసారి తప్పకుండా అధికారంలోకి వస్తామనే నమ్మకం కలుగుతోందని డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్ పేర్కొన్నారు. మదురైలో జరిగిన పార్టీ సర్వసభ్యమండలి సమావేశానికి అధ్యక్షత వహించిన ఆయన మాట్లాడుతూ కంటికి కనబడే దూరంలో శత్రువుల ఆచూకే లేదని గర్వపడే వ్యక్తిని తాను కాదని, పార్టీ శ్రేణులు, ప్రజల పట్ల వినయవిధేయతలను కలిగి ఉండటం వల్లే తాను ముఖ్యమంత్రినయ్యానని చెప్పారు. వచ్చే యేడాది ఇదే రోజున రాష్ట్రంలో డీఎంకే ఏడోసారి అధికారంలోకి రావటం ఖాయమన్నారు. పార్టీ నాయకుడికి ఎప్పుడూ అహంభావం, గర్వం, ఆశ్రితపక్షపాతం ఉండకూడదని, అందరితోనూ ఆత్మీయంగా మసలుకోవాలని సూచించారు. ఇప్పటివరకూ డీఎంకే గెలిచి అధికారంలోకి రావటానికి కోట్లాదిమంది కార్యకర్తలే కారణమని స్టాలిన్ పేర్కొన్నారు. సూర్యుడు ఎలా శాశ్వతమో డీఎంకే కూడా అలాగే శాశ్వతమన్నారు. ఇకపై రాష్ట్రంలో డీఎంకే ప్రభుత్వమే అధికారంలో ఉంటుందని భావిస్తున్నానని చెప్పారు. అన్నాడీఎంకే, బీజేపీ మధ్య అపవిత్ర కూటమి ఏర్పాటైందని, అసెంబ్లీ ఎన్నికల్లో ఆ కూటమి చిత్తుగా ఓడిపోవటం ఖాయమని స్టాలిన్ జోస్యం చెప్పారు. అధికారంలోకి వస్తామంటూ పదే పదే చెబుతున్న బీజేపీ రాష్ట్రంలో అధికారంలో వస్తే మత ఘర్షణలు ఎక్కువవుతాయని, అంతా కాషాయమయమవుతుందని, చదువులకు ప్రాధాన్యత ఇవ్వరని ఆయన విమర్శించారు

ప్రతి పోలింగ్ కేంద్రం దగ్గర 30 శాతం సభ్యత్వం...

రెండు నెలల వ్యవధిలో ప్రతి పోలింగ్ కేంద్రం దగ్గర 30 శాతం మందికి పార్టీ సభ్యత్వం కల్పించాలని జిల్లా శాఖ కార్యదర్శులు, ఇన్‌ఛార్జులు, బూత్‌కమిటీల నాయకులకు ఆదేశాలిస్తూ మదురైలో జరిగిన సర్వసభ్యమండలి సమావేశంలో ప్రత్యేక తీర్మానం చేశారు. నాలుగేళ్లుగా డీఎంకే ద్రావిడ తరహా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ముమ్మర ప్రచారం చేయాలని ఆ తీర్మానంలో కోరారు. వచ్చే యేడాది జరిగే ఎన్నికల్లో డీఎంకే కూటమి ఘన విజయం సాధించడం ఖాయమే అయినా, కనీసం 200 సీట్లు గెలుచుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ విజయం సాధించాలంటూ యువతీయువకులకు పార్టీ సభ్యత్వం కల్పించాల్సిన అవసరం కూడా ఉందన్నారు. ఆ ప్రకారం పార్టీ సభ్యత్వం కల్పించేందుకు జిల్లా నేతలంతా కృషి చేయాలని ఆ తీర్మానంలో పేర్కొన్నారు.

రూ.10లక్షల సాయం...

డీఎంకే ఏడు దశాబ్దాలుగా పటిష్ఠంగా ఉండటానికి కార్యకర్తలేనని, వారి సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని పార్టీ శ్రేణుల్లో ఎవరైనా రోడ్డు ప్రమాదాల్లో మృతి చెందితే ఆ వ్యక్తికి 21యేళ్లలోపున్న వారసులుంటే వారికి పార్టీ తరఫున రూ.10లక్షల ఆర్థిక సహాయాన్ని అందించనున్నామని సభ్యుల హర్షధ్వానాల నడుమ స్టాలిన్ ప్రకటించారు. ఈ సమావేశంలో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, మంత్రులు దురైమురుగన్, కేఎన్ నెహ్రూ, ఐ.పెరియసామి, మూర్తి, ఎంపీలు టీఆర్ బాలు, తిరుచ్చి శివా, ఏ రాజా తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో 3400 మంది సర్వసభ్య మండలి సభ్యులు సహా ఏడువేలమంది హాజరయ్యారు. వీరిలో జిల్లా శాఖ కార్యదర్శులు, 23 విభాగాలకు చెందిన నాయకులు కూడా ఉన్నారు.

అళగిరితో భేటీ...

సర్వసభ్యమండలి సమావేశంలో పాల్గొనేందుకు శనివారం సాయంత్రం మదురై నగరానికి చేరుకున్న డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్ తన సోదరుడు, కేంద్ర మాజీ మంత్రి ఎంకే అళగిరిని కలుసుకున్నారు. అళగిరి, ఆయన సతీమణి, కుటుంబ సభ్యులు స్టాలిన్‌ను సాదరంగా ఆహ్వానించారు. కాసేపు అళగిరి, కుటుంబ సభ్యుల యోగక్షేమాలు తెలుసుకున్న తర్వాత స్టాలిన్ అక్కడికి నుండి బయలుదేరారు.

డీఎంకేలో కొత్తగా రెండు విభాగాలు...

డీఎంకే సర్వసభ్యమండలి సమావేశం ప్రతియేటా జరుగుతున్నప్పటికీ మదురై నగరంలో 47 యేళ్ల తర్వాత మూడోసారి ఆ సమావేశం ఆదివారం అట్టహాసంగా జరిగింది. మదురై ఉత్తంగుడిలో ఏర్పాటైన ఈ సమావేశంలో డీఎంకే అధ్యక్షుడు, ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రవేశద్వారం ఎదుట వందడుగుల స్తంభంపై పార్టీ పతాకాన్ని ఎగురవేశారు. ఆ తర్వాత వేదికపై దివంగత నేతలు పెరియార్, అన్నాదురై, కరుణానిధి, అన్బళగన్ చిత్రపటాలకు పుష్పాంజలి ఘటించారు. అనంతరం మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్, పోప్ ఫ్రాన్సిస్, ఇస్రో మాజీ అధ్యక్షుడు కస్తూరి రంగన్, డీఎండీకే అధ్యక్షుడు విజయకాంత్, కాంగ్రెస్ సీనియర్ నేత కుమరి అనంతన్, ఇటీవల కశ్మీర్‌లోని పహల్గాం ఉగ్ర దాడిలో బలైనవారికి సంతాపంగా మౌనం పాటించారు. ఆ తర్వాత సర్వసభ్యమండలి సమావేశం ప్రారంభమైంది. ఆ సందర్భంగా పార్టీలో కొత్తగా రెండు విభాగాలను ఏర్పాటు చేయనున్నట్లు పార్టీ ప్రధాన కార్యదర్శి దురైమురుగన్ ప్రకటించారు. ఆ మేరకు డీఎంకేకు చెందిన అధ్యాపకులు, ప్రొఫెసర్లతో విద్యావేత్తల విభాగం, దివ్యాంగుల విభాగం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ రెండు కొత్త విభాగాలతో డీఎంకేలోని విభాగాల సంఖ్య 25కు పెరుగుతుందని పేర్కొన్నారు.

26 రకాల ఆహారపదార్థాలతో విందు...

డీఎంకే సర్వసభ్యమండలిలో ఆదివారం ఉదయం శాఖాహారం, మాంసాహారం విభాగంలో పార్టీ నాయకులు, ప్రముఖులు, కార్యకర్తలకు 22 రకాల ఆహారపదార్థాలను వడ్డించారు.


సర్వసభ్యమండలి సమావేశానికి హాజరైన నాయకులు



కచ్చాదీవికి విముక్తి కలిగించి

జాలర్లను కాపాడండి

● సెమ్మొళిదినంగా కరుణానిధి జన్మదినం
● వక్ఫ్‌చట్ట సవరణకు నిరసన
● డీఎంకే సర్వసభ్య మండలిలో 27 తీర్మానాలు



డీఎండీకే నేత విజయకాంత్, టీఎన్‌సీసీ మాజీ అధ్యక్షుడు కుమరి అనంతన్ మృతికి సంతాపంగా మౌనం పాటిస్తున్న డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్ తదితరులు

చెన్నై, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): తమిళజాలర్ల సమస్యలను శాశ్వతంగా పరిష్కరించడానికి కచ్చాదీవికి విముక్తి కల్పించాలని కేంద్రాన్ని కోరుతూ, వక్ఫ్ చట్ట సవరణను ఖండిస్తూ, కీళడి నివేదిక తిరస్కరించిన కేంద్రం తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ మదురైలో ఆదివారం జరిగిన డీఎంకే సర్వసభ్యమండలి సమావేశంలో తీర్మానాలు చేశారు. ఈ సమావేశంలో మొత్తం 27 తీర్మానాలను ప్రతిపాదించి ఆమోదించారు.

☛ మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి జన్మదినమైన జూన్ 3న సెమ్మొళి దినంగా జరుపుకోవాలి.
☛ రాష్ట్ర ప్రజల మద్దతుతో విజయపథంలో పయనిస్తున్న పార్టీ అధినేత స్టాలిన్‌కు ప్రశంస
☛ మహిళాభ్యుదయంలో దేశానికే ఆదర్శవంతమైన ద్రావిడ తరహా పాలనకు ప్రశంస
☛ రైతులు, చేనేత కార్మికులు, జాలర్లు సహా అన్నివర్గాల జీవితాల్లో వెలుగులు నింపిన ద్రావిడతరహా పరిపాలన సాధించిన విజయాలపై విస్తృత ప్రచారం
☛ తమిళభాషకు, తమిళ ప్రజల కోసం పాటుపడుతున్న నాయకుల కీర్తి ప్రతిష్ఠతలకు సముచిత గౌరవం ఇస్తున్న డీఎంకే ప్రభుత్వానికి ప్రశంస
☛ ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూర్చిన డీఎంకే ద్రావిడ తరహా పాలనలో అమలు చేస్తున్న పథకాలపై విస్తృత ప్రచారం
☛ రాష్ట్ర భవిష్యత్ ఆశాకిరణం ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి సేవలు కొనసాగించేందుకు పార్టీ శ్రేణులంతా సమష్టి మద్దతు
☛ పేద, బడుగు, బలహీన వర్గాలకు తీరని నష్టం కలిగించే నగల తాకట్టు నిబంధనలను ఆర్బీఐ ఉపసంహరించుకోవాలి.
☛ రాష్ట్రానికి నిధులు విడుదల చేయని కేంద్రం తీరుపై ఖండన
☛ నిర్బంధ హిందీకి వ్యతిరేకత
☛ కీళడి నివేదికను తిప్పిపంపిన కేంద్రానికి నిరసన
☛ కొత్త రైల్వే ప్రాజెక్టులు ప్రకటించని కేంద్రంపై ఆగ్రహం
☛ వక్ఫ్ చట్ట సవరణ బిల్లుకు వ్యతిరేకత
☛ కేంద్రంలోని దర్యాప్తు సంస్థలను దుర్వినియోగపరస్తున్న కేంద్ర ప్రభుత్వానికి ఖండన
☛ ప్రధాని మోదీ నాయకత్వంలో బీజేపీ పాలనలో కొనసాగుతున్న అవినీతి, అక్రమాలపై ఆగ్రహం
☛ జాలర్ల సమస్యల శాశ్వత పరిష్కారానికి కచ్చాదీవి విముక్తే శరణ్యం
☛ కులాల వారీ గణనను వీలయినంత త్వరగా ప్రారంభించాలి.
☛ పునర్విభజన పేరుతో రాష్ట్రంలో లోక్‌సభ సభ్యుల సంఖ్య తగ్గించేందుకు కేంద్రం చర్యలకు తీవ్ర ఖండన
☛ హద్దులు దాటిన గవర్నర్ అధికారాలకు సుప్రీం కోర్టు తీర్పుద్వారా కళ్లెం వేసిన స్టాలిన్‌కు ధన్యవాదాలు
☛ రాజ్యాంగ ధర్మాసనాన్ని గౌరవించకుండా సుప్రీం కోర్టుతో తలపడుతున్న బీజేపీ సర్కారుకు ఖండన
☛ సుప్రీం కోర్టు తీర్పు మేరకు విద్యను రాష్ట్ర జాబితాలో చేర్చాలి.
☛ రాష్ట్రంలో మళ్ళీ స్వయంప్రతిపత్తి పాలన వికసించాలి.
☛ అంతటా తమిళం.. అన్నింటా తమిళం... నేమ్‌బోర్డులు తమిళంలో ఏర్పాటు చేయాలి.
☛ పొల్లాచ్చి సామూహిక అత్యాచారాల కేసులో కోర్టు తీర్పును స్వాగతిస్తూ తీర్మానం
☛ రాష్ట్రంలో బీజేపీ, అన్నాడీఎంకే అపవిత్ర కూటమిని 2026 శాసనసభ ఎన్నికల్లో చిత్తుగా ఓడిద్దాం.

వీటితో పాటు మరో రెండింటితో కలిసి మొత్తం 27 తీర్మాణాలను సర్వసభ్య మండలిలో తీర్మాణించారు.

రాజ్యసభకు ఇన్బదురై, ధనపాల్

● వచ్చే యేడాది డీఎండీకేకు సీటు! ● అన్నాడీఎంకే ప్రకటన


ఎడప్పాడి పళనిస్వామిని మర్యాద పూర్వకంగా కలుసుకున్న రాజ్యసభ అభ్యర్థులు ధనపాల్, ఇన్బదురై

చెన్నై, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): రాజ్యసభ ఎన్నికల్లో అన్నాడీఎంకే తరఫున ఐఎస్ ఇన్బదురై, ఎం.ధనపాల్ పోటీ చేస్తారని, తమ కూటమిలోనే కొనసాగుతున్న డీఎండీకేకు 2026లో ఓ రాజ్యసభ స్థానాన్ని కేటాయిస్తామని ఆ పార్టీ ప్రకటించింది. ఆదివారం ఉదయం రాయపేటలోని పార్టీ ప్రధాన కార్యాలయం ఎంజీఆర్‌మాళిగైలో జరిగిన మీడియా సమావేశంలో అన్నాడీఎంకే డిప్యూటీ ప్రధాన కార్యదర్శి కేపీ మునుసామి, సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి ఎస్పీ వేలుమణి ఈ విషయాన్ని ప్రకటించారు. రాజ్యసభ ఎన్నికల్లో పోటీ చేయనున్న ఇన్బదురై అన్నాడీఎంకే న్యాయవిభాగం కార్యదర్శిగా ఉన్నారు. ఇక ఎం. ధనపాల్ పార్టీ చెంగల్పట్టు తూర్పు జిల్లా శాఖ ప్రిసీడియం ఛైర్మన్‌గా, కాంచీపురం జిల్లా పంచాయతీరాజ్ మాజీ అధ్యక్షుడిగా ఉన్నారు. వారిద్దరూ ఆదివారం ఉదయం అడయార్ గ్రీన్‌వేస్ రోడ్డులో ఉన్న పార్టీ అధ్యక్షుడు ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) నివాసానికి వెళ్ళి ఆయనకు పుష్పగుచ్చాలు అందించి, సత్కరించారు. రాష్ట్రం నుండి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్న వైగో, విల్సన్, ఎం.షణ్ముగం, మహమ్మద్ అబ్దుల్లా, అన్బుమణి, ఎస్.చంద్రశేఖర్ పదవీ కాలం జూలై 27న ముగియనుంది. ఆ నేపథ్యంలో ఆరు రాజ్యసభ స్థానాలకు ఎన్నికల నిర్వహించనున్నట్లు కేంద్ర ఎన్నికల సంఘం ఇటీవలే ప్రకటన చేసింది. ఆ ఎన్నికల్లో డీఎంకే కూటమి నాలుగు స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. ఈ నేపథ్యంలో అన్నాడీఎంకే రెండు స్థానాల్లో పోటీ చేయనున్నట్లు అభ్యర్థులను ఆదివారం వెల్లడించింది.


రాజ్యసభ ఎన్నికలకు అభ్యర్థుల వివరాలను ప్రకటిస్తున్న మునుసామి, ఎస్పీ వేలుమణి

ఈ ఎన్నికల్లో అన్నాడీఎంకే అధిష్ఠానవర్గం తమకు ఒక రాజ్యసభ స్థానాన్ని కేటాయిస్తుందని ఎదురుచూసిన డీఎండీకే నాయకురాలు ప్రేమలతకు నిరాశే మిగిలింది. ఈ విషయమై మీడియా సమావేశంలో ప్రేమలత మాట్లాడుతూ తమ పార్టీ అన్నాడీఎంకే కూటమిలోనే కొనసాగుతోందని చెప్పారు. వచ్చే యేడాది తమ పార్టీకి రాజ్యసభ సీటును కేటాయించనున్నట్లు అన్నాడీఎంకే ప్రకటించి తన గురుతరబాధ్యత నిర్వర్తించిందన్నారు. ఇక అసెంబ్లీ ఎన్నికల్లో ఏపార్టీలతో పొత్తు కుదుర్చుకుంటామనే విషయంపై జనవరిలో జరుగనున్న డీఎండీకే మహానాడులో ప్రకటిస్తామన్నారు. ఆదివారం జరిగిన డీఎంకే సర్వసభ్యమండలి సమావేశంలో డీఎండీకే వ్యవస్థాపకుడు విజయకాంత్ మృతికి సంతాపం ప్రకటించినందుకు ఆ పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్‌కు ఆమె ధన్యవాదాలు తెలిపారు.

నేటినుంచి

బడులు

● ముగిసిన వేసవి సెలవులు
● పుస్తకాలు, యూనిఫాం పంపిణీకి సిద్ధం

అడయార్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వేసవి సెలవులు ముగియడంతో సోమవారం నుంచి రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలన్నీ తెరుచుకోనున్నాయి. తొలి రోజునే పాఠశాలకు వచ్చే విద్యార్థులకు యూనిఫామ్, నోటు పుస్తకాలను కూడా పంపిణీ చేసేలా విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లుచేశారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా 32 వేల పాఠశాలలు ఉండగా, వీటిలో సుమారుగా 40 లక్షల మంది విద్యార్థులు చదువుతున్నారు. మార్చి, ఏప్రిల్ నెలల్లో జరిగిన పబ్లిక్ పరీక్షల తర్వాత వేసవి సెలవులు ఇచ్చారు. ఆ ప్రకారంగానే సోమవారం నుంచి బడి గంటలు మోగనున్నాయి. అయితే, ఎండల తీవ్రత అధికంగా ఉండటంతో ఒకటి నుంచి 9, ప్లస్ వన్ విద్యార్థులకు మాత్రం వేసవి సెలవులు పొడిగించాలన్న డిమాండ్లు వచ్చాయి. కానీ, ఇదే విషయంపై విద్యారంగ నిపుణులతో విద్యాశాఖ ఒక కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ అధ్యయనం చేసి పాఠశాల పునఃప్రారంభానికి ఎలాంటి అడ్డంకులు లేవని పేర్కొంది. దీంతో సోమవారం నుంచి పాఠశాలలను ప్రారంభించేందుకు విద్యాశాఖ అంగీకరించింది. తొలి రోజునే అచ్చు, నోటు పుస్తకాలు, విద్యా సామగ్రి పంపిణీ చేసేలా విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. పాఠశాలలు తెరుచుక్కు తొలి రోజునే కొత్తగా అడ్మిషన్లు కూడా ప్రారంభించాలని విద్యాశాఖ అధికారులు ఆదేశించారు. అలాగే ఎనిమిదో తరగతి ఉత్తీర్ణులై స్కూల్ మానేసిన విద్యార్థులను తిరిగి బడిలో చేర్పేందుకు దృష్టిసారించాలని కోరారు. ఒకటి నుంచి 5వ తరగతి వరకు చదుకునే విద్యార్థులకు ముఖ్యమంత్రి అల్పాహార పథకం కింద ఉదయం వేళల్లో అల్పాహారం వడ్డించే సమయాన్ని తెలియజేయాలని ఆదేశించారు. కాగా, కొత్త విద్యా సంవత్సరంలో బడులకు వచ్చే విద్యార్థులను స్వాగతించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.


ఓ పాఠశాలలో తరగతి గదిలో ఫాగింగ్ చేస్తున్న కార్మికుడు

రాష్ట్రంలో 6 వరకు వర్షాలు

● ఐఎండీ వెల్లడి

అడయార్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ దిశ గాలుల వేగంలో హెచ్చుతగ్గుల కారణంగా ఈనెల ఆరో తేదీ వరకు రాష్ట్రంలో వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది. నైరుతు రుతుపవనాలు ప్రారంభమైన తర్వాత రాష్ట్రంలో అనేక జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్న విషయం తెల్సిందే. ఈ నేపథ్యంలో పశ్చిమ దిశ గాలుల వేగంలో మార్పుల కారణంగా రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల సహా పుదుచ్చేరి, కారైక్కాల్ ప్రాంతాల్లో తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. చెన్నై నగరంలో రానున్న 24 గంటల్లో ఆకాశం మేఘావృతమై ఉంటుందని తెలిపింది. నగరంలోని కొన్ని ప్రాంతాల్లో వర్షపు జల్లులు కురిసే అవకాశం ఉందని వెల్లడించింది. 2 నుంచి 4 వరకు దక్షిణ తమిళనాడు కోస్తాతీర ప్రాంతం, గల్ఫ్ ఆఫ్ మన్నార్, కుమరి సముద్రతీర ప్రాంతాల్లో ఈదురుగాలులు గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో వీస్తాయని కొన్ని సమయాల్లో ఈ గాలుల వేగం గంటకు 60 కిలోమీటర్ల మేరకు ఉంటాయని తెలిపింది.

ఏ నిమిషానికి ఏమి జరుగునో?

పీఎంకే అధినేత నిర్వేదం

అడయార్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): తమ పార్టీలో ఎప్పుడు ఏమి జరుగుతుందో ఊహించలేమని పీఎంకే వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ ఎస్.రాందాస్ విరక్తితో వ్యాఖ్యానించారు. దిండివనం తైలాపురం గార్డెన్‌లో రాందాస్‌ను పీఎంకే సీనియర్ నేతలు కొందరు కలిసి పార్టీలో నెలకొన్న తాజా పరిస్థితులపై చర్చించారు. ఆ తర్వాత రాందాస్ మీడియాతో మాట్లాడుతూ, తమ పార్టీలో ఏ క్షణాన ఏం జరుగుతుందో చెప్పలేమన్నారు. పార్టీ అధ్యక్షుడు అన్బుమణి గత మూడురోజులుగా జిల్లా నేతల సమావేశం జరుపుతుండటంపై ఆయన ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు. అదే సమయంలో వస్తారు.. పోతారు.. ఒకరు వస్తారు. మరొకరు పోతారు అంతా రిపీట్! అంటూ నిర్వేదంగా మాట్లాడారు. పార్టీ నిబంధలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత తదుపరి చర్యలపై స్పందిస్తానని వెల్లడించారు. పీఎంకే ఆధ్వర్యంలో ప్రతి యేటా మహిళా మహానాడును నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ఈ యేడాది కూడా ఆగస్టు 10న మహానాడు నిర్వహించాలని నిర్ణయించినట్టు తెలిపారు. ఈ మహానాడును పీఎంకే మహిళా సీనియర్ నేత అరుళ్‌మొళి అధ్యక్షురాలిగా వ్యవహరిస్తారని రాందాస్ పేర్కొన్నారు. అన్బుమణిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని రాందాస్ నిర్ణయించారని ఆయన అనుచరులు చెబుతున్నారు. ఆ దిశగానే గురువారం లోగా ఓ నిర్ణయాన్ని తీసుకుని ప్రకటిస్తారని చెబుతున్నారు.


డాక్టర్ ఎస్.రాందాస్

సమాచార దృశ్విని

నేటినుంచి యధావిధిగా హైకోర్టు

పెరంబూర్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల అనంతరం సోమవారం నుంచి హైకోర్టు యధావిధిగా పనిచేయనుంది. మద్రాసు హైకోర్టు, హైకోర్టు మదురై బెంచ్‌లకు గత నెల 1వ తేది నుంచి ఈ నెల 1వ తేది వరకు వేసవి సెలవులు ప్రకటించారు. వేసవి సెలవులు ముగియడంతో సోమవారం నుంచి మద్రాసు హైకోర్టు, హైకోర్టు మదురై డివిజన్ బెంచ్‌లు యధావిధిగా పనిచేయనున్నాయి.

కుట్రాలంలో స్నానాలకు అనుమతి

పెరంబూర్, జూన్ 1: ఏడు రోజుల అనంతరం కుట్రాలం జలపాతంలో పర్యాటకుల స్నానాలకు అనుమతించారు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం, నైరుతి రుతుపవనాల ప్రభావంతో పశ్చిమ కనుమల కొండ ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో, తెన్‌కాశి జిల్లా కుట్రాలం జలపాతం వద్ద నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో పర్యాటకులు ఆ ప్రాంతానికి వెళ్లేందుకు, స్నానం చేసేందుకు అటవీ అధికారులు నిషేధం విధించారు. ఈ క్రమంలో, పశ్చిమ కనుమల్లో వర్షాలు తగ్గుముఖం పట్టడం, కుట్రాలం జలపాతం వద్ద నీటి ప్రవాహం తగ్గడంతో ఆదివారం నుంచి జలపాతం వద్దకు పర్యాటకులను అనుమతించారు.

రేపు విద్యుత్ గ్రీవెన్స్

పెరంబూర్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక మైలాపూర్, కేకే నగర్, తండయార్‌పేట, అంబత్తూర్ ప్రాంతాల్లో మంగళవారం ఉదయం 11 గంటలకు విద్యుత్ గ్రీవెన్స్ జరుగనుంది. కేకే నగర్ పరిధిలో కేకే నగర్ ఉప విద్యుత్ కేంద్రం ప్రాంగణంలోని నిర్వహణ ఇంజనీర్ కార్యాలయం, మైలాపూర్ పరిధిలో వళ్లువరం కోట్టం సమీపం ఉప విద్యుత్ కేంద్రం ప్రాంగణంలోని నిర్వహణ ఇంజనీర్ కార్యాలయంలో జరుగనున్న గ్రీవెన్స్‌లో, ఆయా ప్రాంతాలకు చెందిన విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలకు పరిష్కారం పొందవచ్చని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది. అంబత్తూర్ ఎస్టేట్ మూడో మెయిన్ రోడ్డులోని ఉప విద్యుత్ కేంద్రం, తండయార్‌పేట టవర్ క్లాక్ ఎదురుగా ఉన్న నిర్వహణ ఇంజనీర్ కార్యాలయాల్లోనూ విద్యుత్ గ్రీవెన్స్ జరుగనుంది.

ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్ జిల్లా అంబత్తూర్ ఐటీఐలో చేరేందుకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ మేరకు ఆ జిల్లా కలెక్టర్ ప్రతాప్ విడుదల చేసిన ప్రకటనలో... కంప్యూటర్ హార్డ్‌వేర్, వెబ్‌సైట్ నిర్వహణ, కంప్యూటర్ ఆపరేటర్, ఎలక్ట్రీషియన్ సహా 28 కోర్సుల్లో చేరేందుకు 8, 10, ప్లస్ టూ పాస్ లేదా ఫెయిల్ అయిన వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. శిక్షణలో నెలకు రూ.750 స్టైఫండ్, ఉచిత బస్ పాస్, సైకిల్, పాఠ్య పుస్తకాలు, యూనిఫాం, షూ తదితరాలు అందజేయనున్నారు. కోర్సు పూర్తిచేసిన వారికి కర్మాగారాలు, సంస్థల్లో ఉద్యోగ అవకాశం కల్పించనున్నారు. ఆసక్తి కలిగిన వారు మార్కుల జాబితా, ఇతర సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, ఐదు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు, రూ.50 రుసుము చెల్లించాలి. దరఖాస్తులు నేరుగా అందించేందుకు వీలుకాని వారు www.skilltraining.tn.gov.in అనే వెబ్‌సైట్‌లో ఈ నెల 13వ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని కలెక్టర్ తెలిపారు.

ఇంజనీరింగ్ కోర్సులకు 2.74 లక్షల దరఖాస్తులు

పెరంబూర్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరేందుకు 2.74 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. అన్నా విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలలు, ప్రభుత్వ, ఎయిడ్ ఇంజనీరింగ్ కళాశాలలు, స్వయం ప్రతిపత్తి కళాశాలలు అని 440 ఇంజనీరింగ్ కళాశాలల్లో సుమారు 2 లక్షలకు పైగా సీట్లున్నారు. 2025-26వ సంవత్సరానికి బీఈ, బీటెక్ కోర్సుల్లో అడ్మిషన్లకు సంబంధించిన ఆన్‌లైన్ దరఖాస్తు స్వీకరణ గత నెలలో ప్రారంభమైంది. శనివారం సాయంత్రం వరకు 2.71 లక్షల మంది దరఖాస్తు చేసుకోగా, వారిలో 2,12,593 మంది దరఖాస్తు రుసుము చెల్లించగా, 1,77,646 మంది సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేశారు. గత ఏడాది ఇంజనీరింగ్ కోర్సుల అడ్మిషన్లకు 2.53 లక్షల దరఖాస్తులు అందిన నేపథ్యంలో, ఈ ఏడాది 2.74 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. విద్యార్థులు www.tneaonline.org అనే వెబ్‌సైట్‌లో ఈ నెల 6వ తేది వరకు దరఖాస్తు చేసుకోవచ్చు.

నామక్కల్ నుంచి అమెరికాకు కోడిగుడ్లు

పెరంబూర్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): నామక్కల్ నుంచి అమెరికాకు కోడిగుడ్లు ఎగుమతి చేయనున్నట్లు జాతీయ కోడిగుడ్ల సమన్వయ ప్రాంతీయ కమిటీ అధ్యక్షుడు సింగరాజ్ తెలిపారు. నామక్కల్‌లో ఆయన శనివారం మీడియాతో మాట్లాడుతూ... నామక్కల్ ఫారాల్లో కోడిగుడ్డు ధర రూ.5.60 ఉందన్నారు. రాష్ట్రంలో సోమవారం నుంచి పాఠశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో పౌష్టికాహార పథకానికి కోడిగుడ్లు సరఫరా ప్రారంభమవుతోందని, ఈ కారణంగా కోడిగుడ్డు ధరలు పెరిగే అవకాశముందన్నారు. ప్రస్తుతం దుబాయ్, ఆఫ్రికా తదితర దేశాలకు రోజుకు 80 లక్షల గుడ్లు ఎగుమతి చేస్తున్నామన్నారు. టర్కీ నుంచి యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ దేశానికి అధికంగా గుడ్లు ఎగుమతి చేస్తున్నారని, ప్రస్తుతం టర్కీ నుంచి కోడిగుడ్ల దిగుమతులు ఆ దేశం నిలిపివేసిందన్నారు. దీంతో, అరబ్ ఎమిరేట్స్‌కు అధికంగా నామక్కల్ నుంచి కోడిగుడ్లు ఎగుమతి చేస్తున్నామని, అమెరికాకు కూడా ఎగుమతి చేసేందుకు చర్చలు జరుపుతున్నట్లు సింగరాజ్ తెలిపారు.

తగ్గిన వాణిజ్య సిలిండర్ ధర

పెరంబూర్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): నగరంలో వాణిజ్య వినియోగ గ్యాస్ సిలిండర్ ధర రూ.25 తగ్గి రూ.1,881కి విక్రయమవుతోంది. చమురు సంస్థలు గృహాలకు 14.20 కిలోలు, వాణిజ్య వినియోగానికి 19 కిలోల గ్యాస్ సిలిండర్లు సరఫరా చేస్తుంటాయి. అంతర్జాతీయంగా ముడిచమురు ధరలకు అనుకూలంగా, దేశంలో ప్రతినెలా మొదటి రోజు, గ్యాస్ సిలిండర్ ధరలు మార్పు చేస్తుంటారు. ఆ క్రమంలో, జూన్ నెలకు సంబంధించి వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర రూ.25 తగ్గగా, గృహ వినియోగ సిలండర్ ధరలో ఎలాంటి మార్పులు లేకుండా రూ.818.50కి విక్రయమవుతోంది. కాగా, మే నెలలో కూడా వాణిజ్య గ్యాస్ సిలిండర్ ధర రూ.15.50 తగ్గడం గమనార్హం.

ఢిల్లీ మదరాసీ క్యాంప్‌లో నివాసాల తొలగింపు




ఢిల్లీలో మదరాసీ క్యాంప్ కాలనీ, ఇళ్లను కూల్చివేస్తున్న దృశ్యం

అడయార్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ హైకోర్టు ఆదేశాల మేరకు రాజధానిలో లోతట్టు ప్రాంతాల్లో ఉన్న తమిళ వలస ప్రజల నివాసాలను అధికారులు తొలగించారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతంలో ఉద్రిక్తత నెలకొంది. ఢిల్లీలోని జంగ్‌పురా ప్రాంతంలో 'మదరాసీ క్యాంప్' కాలనీలో నివసించే వారి ఇళ్లను ఢిల్లీలోని బీజేపీ ప్రభుత్వం తొలగించే పనుల్లో నిమగ్నమైంది. ఆ గృహాల తొలగింపునకు ఢిల్లీ హైకోర్టు కూడా అనుమతిచ్చింది. ఈ ప్రాంతంలో సుమారు 700 తమిళ కుటుంబాలు కొన్ని దశాబ్దాలుగా నివసిస్తున్నాయి. ఆ గృహాల తొలగింపు నిర్ణయాన్ని ప్రభుత్వ ఉపసంహరించుకోవాలని కొన్ని రోజులుగా న్యాయపోరాటం చేశారు. గత నెలలో బాధితులంతా కలిసి ఢిల్లీ సచివాలయాన్ని ముట్టడించి ఆందోళన చేపట్టారు. అదేసమయంలో ఆ కాలనీలో ఇళ్లు కోల్పోతున్న వారికి 40 కిలోమీటర్ల దూరంలో ప్రత్యామ్నాయ స్థలాలను కేటాయించారు. ఆ ప్రాంతం తమ పిల్లల పాఠశాలలకు, తమ పనులకు చాలా దూరంగా ఉన్నాయని బాధితులు పేర్కొన్నారు. అదేసమయంలో ఢిల్లీ హైకోర్టు కూడా ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పునిచ్చింది. దీంతో కోర్టు ఆదేశాల మేరకు ఈ ప్రాంతంలోని నివాసాలను ఆదివారం ఉదయం నుంచి కూల్చివేశారు. అక్కడ ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో పోలీసు బలగాలు మొహరించారు.

స్వస్థలాలకు పంపే ఏర్పాట్లు...

ఇదిలా ఉండగా ఢిల్లీలో మదరాసి క్యాంప్ కాలనీలో దశాబ్దాలుగా నివసిస్తున్న తమిళుల నివాసాలను కూల్చివేయటం పట్ల రాష్ట్ర ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రత్యామ్నాయ స్థలానికి వారిని తరలించక ముందే వారి కళ్లెదుటే ఇళ్లను కూల్చివేయటం భావ్యం కాదని పేర్కొంది. ఈ పరిస్థితుల్లో ఆ కాలనీలో నివసిస్తున్న 376 మంది స్వరాష్ట్రానికి రావాలని అనుకుంటే వారికి ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు.

పశ్చిమ తీరప్రాంతాల్లో చేపల వేట నిషేధం



ఫిషింగ్ హార్బర్‌లో నిలిపిన బోట్లు

పెరంబూర్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): కన్నియాకుమారి జిల్లా పశ్చిమ తీరప్రాంతంలో చేపల వేటపై నిషేధం ఆదివారం నుంచి అమలులోకి వచ్చింది. కన్నియాకుమారి జిల్లా కుళచ్చల్, ముట్టం, తేంగాయపట్టణం ఫిషింగ్ హార్బర్ల నుంచి 500లకు పైగా మోటారు బోట్లలో జాలర్లు పశ్చిమ తీరంలోని అరేబియా సముద్ర ప్రాంతంలో చేపల వేటకు వెళతుంటారు. ఈ క్రమంలో, చేపల సంతానోత్పత్తి కాలాన్ని పరిగణలోకి తీసుకొని, ప్రతి సంవత్సరం జూన్ 1 నుంచి జూలై 31వ తేది వరకు అరేబియా సముద్రం ప్రాంతంలో చేపల వేటకు నిషేధం విధిస్తుంటారు. నిషేధ కాలం ఆదివారం నుంచి అమలుకు రావడంతో మనక్కుడి నుంచి నీరోడి వరకు సుమారు 500 మోటారు బోట్లు చేపల వేటకు వెళ్లకుండా కులచ్చల్, ముట్టం, తేంగాయపట్టణం ఫిషింగ్ హార్బర్లలో నిలిపివేశారు.

నిందితుడి నుంచి నగలు, నగదు స్వాహా: ఎస్ఐ అరెస్ట్

పెరంబూర్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): హత్య కేసు నిందితుడి నుంచి నగలు, నగదు తీసుకున్న వ్యవహారంలో ఎస్ఐ కటకటాల పాలయ్యాడు. కోవై జిల్లా మాదపూర్‌కు చెందిన రవికుమార్ కుమారుడు వరుణ్‌కాంత్ (22) మానసిక వ్యాధితో బాధపడుతుండగా, తల్లిదండ్రులు అతడిని మహాలింగపురం ముల్లైనగర్‌లోని ప్రైవేటు హోంలో చేర్పించారు. ఈ నెల 12న వరుణ్‌కాంత్ హత్యచేసిన హోం సిబ్బంది, హోం నిర్వాహకులు కవితకు చెందిన తోటలో పూడ్చిపెట్టారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసిన పోలీసులు కవిత సహా 11 మందిని అరెస్ట్ చేశారు. మొదట నిందితుల ఆచూకీ కోసం 8 ప్రత్యేక బృందాలు ఏర్పాటుకాగా, వాటిలో ఒక బృందానికి మహాలింగపురం ఎస్ఐ నవనీతకృష్ణన్ నేతృత్వంలో మేట్టుపాళయం ఎస్ఐ మహారాజ, పోలీసులు ఉన్నారు. ఈ బృందం గత నెల 28వ తేది తిరువంతపురం జాతీయ రహదారిపై వెళ్తున్న కారులో హోం నిర్వాహకులు కవిత, శృతి, శ్రేయ సహా ఐదుగురిని అరెస్ట్ చేశారు. ఆ సమయంలో వారి నుంచి 18 సవర్ల నగదు, రూ.1.5 లక్షల నగదును ఎస్ఐ నవనీతకృష్ణన్ స్వాధీనం చేసుకున్నారు. నగదు, నగలు స్వాధీనం చేసుకున్న విషయాన్ని ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వకపోగా, వాటిని పోలీస్ స్టేషన్‌లో అప్పగించలేదని సమాచారం. అనంతరం కవిత బంధువులు కారులో ఉన్న నగదు, నగలు కనిపించడం లేదని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ వ్యవహారంపై విచారణ చేపట్టిన ఉన్నతాధికారులు, నగదు, నగలను ఎస్ఐ నవనీతకృష్ణన్ తీసుకున్నాడని తేలడంతో అతనిని అరెస్ట్ చేసి విచారణ చేస్తున్నారు.

● బక్రీద్ ఎఫెక్ట్....

రూ.5 కోట్ల మేర గొర్రెలు, మేకల విక్రయాలు



వారసంతలో వ్యాపారులు, రైతులు

పెరంబూర్, జూన్ 1: నత్తం వారసంతలో ఆదివారం ఒకేరోజు రూ.5 కోట్ల మేర గొర్రెలు, మేకలు విక్రయం కావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. దిండుగల్ జిల్లా నత్తంలో ప్రతి ఆదివారం వారసంత నిర్వహిస్తుంటారు. దిండుగల్, మదురై, పుదుకోట, తిరుచ్చి సహా పలు జిల్లాల నుంచి రైతులు పెంచుతున్న గొర్రెలు, మేకలను విక్రయానికి సంతకు తీసుకొస్తుంటారు. ఈ నెల 7వ తేది బక్రీద్ పండుగ కావడంతో వ్యాపారులు, రైతులతో వారపుసంత కిటకిటలాడింది. మేకలు, గొర్రెలు బరువును బట్టి రూ.5 వేల నుంచి రూ.50 వేల వరకు విక్రయమయ్యాయి. సాధారణ విక్రయాల కన్నా ఆదివారం రూ.1,000 నుంచి రూ.5,000 వరకు అదనపు ధర లభించడంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.

అష్టభుజ ఆలయ కొలను శుద్ధి



పెరంబూర్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): కాంచీపురం పరమపతవాసల్ అని పిలిచే స్వర్గ ద్వారం ఉన్న ఏకైక ఆలయంగా గుర్తింపు పొందిన అష్టభుజ పెరుమాళ్ ఆలయ కొలనును ఫిబ్రవరి 26వ తేది నిర్వహించిన కుంభాభిషేకం సందర్భంగా శుభ్రపరిచారు. సరైన పర్యవేక్షణ లేకపోవడంతో చెత్తా చెదారం, పాచి పేరుకుపోయి కొలను నుంచి దుర్గంధం వ్యాపిస్తోంది. భక్తుల కోరిక మేరకు ఆలయ నిర్వాహకులు కొలను శుభ్రం చేయించారు. ఈ విషయమై ఆలయ ట్రస్టీ కమిటీ ఛైర్మన్ సంతోష్‌కుమార్, ఆలయ కార్యనిర్వహణ అధికారి రాజమాణిక్యం మాట్లాడుతూ... ఆలయం చుట్టూ ఉన్న ప్రాంతాల్లో భూగర్భ జలాల స్థాయి పెంచేలా, గజేంద్ర పుష్కరిణి అని పిలిచే కొలను శుభ్రం చేసే పనులు ప్రారంభించామన్నారు. నైరుతి రుతుపవన వర్షాలకు ముందే పనులు పూర్తిచేయాలని నిర్ణయించామని, అలాగే, వర్షాకాలంలో కొలనులో నీరు చేరేలా వర్షపు కాలువలను పునరుద్ధరించనున్నట్లు వారు తెలిపారు.

పొదటూరుపేట డీఎంకే కార్యదర్శిగా రవీంద్రన్



రవీంద్రన్‌ను సత్కరిస్తున్న నాయకులు

తిరుత్తణి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పొదటూరుపేట సౌత్ డీఎంకే నూతన కార్యదర్శిగా జి.రవీంద్రన్ నియమితులయ్యారు. గత కొన్నాళ్ళుగా పళ్లిపట్టు కార్యదర్శిగా పనిచేసిన రవీంద్రన్‌కు పొదటూరుపేట ఎన్నికల బాధ్యతలను అప్పగించింది. ఈ సందర్భంగా ఆదివారం ఉదయం సొరకాయపేట, మేళపూడి, కోణసముద్రం తదితర 33 గ్రామాలకు చెందిన డీఎంకే నాయకులు రవీంద్రన్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మండల యువజన విభాగం నాయకులు గోపి, గోవిందస్వామి, మోహన్, రాజా, వెంకటేశ్వరరెడ్డి, అచ్చుదన్, భారతి, సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తీరప్రాంతాల్లో గస్తీ ముమ్మరం



జాలర్ల వివరాలు సేకరిస్తున్న పోలీసులు

పెరంబూర్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): రామనాథపురం జిల్లా తొండి నుంచి దేవిపట్టణం వరకు కోస్ట్‌గార్డ్ సిబ్బంది 'సజాక్' ఆపరేషన్ ముమ్మరం చేశారు. తీరప్రాంతాల భద్రత, ఉగ్రవాదుల చొరబాటును అడ్డుకోవడం, మాదకద్రవ్యాల అక్రమ రవాణా నియంత్రణ తదితరాలకు కోస్ట్‌గార్డ్ దళాలతో కలసి మెరైన్ పోలీసులు గస్తీ చేపడుతున్నారు. ఆ ప్రకారం, ఎస్పీ పట్టణం, పాసిపట్టణం, తొండి, నంబుదళై, ముల్లిమునై, కరంగాడు, దేవిపట్టణం, తిరుప్పాలైకుడి తదితర తీర ప్రాంతాల్లో 'సజాక్' ఆపరేషన్ చేపట్టారు. సముద్రంలోకి వెళ్లిన జాలర్ల పడవలను పోలీసులు తనిఖీ చేశారు. అనుమానాస్పద వ్యక్తులు, పడవలు గుర్తిస్తే సత్వరం తమకు తెలియజేయాలని పోలీసులు జాలర్లకు సూచించారు.

సైబర్ ముఠాల నుంచి రూ.10.25 కోట్ల రికవరీ

పెరంబూర్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలకు సంబంధించి రూ.10.25 కోట్లు రికవరీ చేసినట్లు సైబర్ క్రైం పోలీసులు తెలిపారు. ఈ ఏడాది జనవరి 1 నుంచి మే 29వ తేది వరకు సైబర్ నేరాలకు సంబంధించి 1,284 ఫిర్యాదులు రాగా, సైబర్ ముఠా నుంచి రూ.10.25 కోట్లు రికవరీ చేశారు.

డీఎస్పీ కార్యాలయం వద్ద ఆటో డ్రైవర్ల ధర్నా



తిరుత్తణి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): తిరుత్తణి మురుగన్ ఆలయానికి వెళ్ళేమార్గంలో ఓ మహిళా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఆటో డ్రైవర్‌ను దూషించిందనే కారణంతో డీఎస్పీ కార్యాలయం ఎదుట ఆటో డ్రైవర్ల సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. వివరాలిలా.. తిరుత్తణి కొండపై విధులు నిర్వహిస్తున్న ఓ మహిళా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ట్రాఫిక్ రద్దీలో వేగంగా వెళ్తున్న ఓ ఆటో ఆపి, డ్రైవర్ ఫొటో తీసి, ఆ వాహనంపై కేసు నమోదు చేసింది. దీనికి ఒప్పుకోని ఆ ఆటో డ్రైవర్ ఆమెతో వాగ్వాదానికి దిగాడు. ఆ సమయంలో ఆమె అతనిపై అనుచిత పదజాలంతో దూషించిందని, ఆటో యూనియన్ నాయకులతో కలిసి ఆమెపై డీఎస్పీ కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు. పరిస్థితి ఉద్రిక్తతకు చేరుకోవడంతో డీఎస్పీ కందన్ వెంటనే చేరుకుని దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో వారు నిరసన విరమించుకుని తిరిగివెళ్లారు.

ఓటేసిన ప్రజలకు కమల్ ద్రోహం

● బీజేపీ ఎమ్మెల్యే వానతి శీనివాసన్



చెన్నై, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మక్కల్ నీదిమయ్యం నేత కమల్‌హాసన్ రెండు ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసి పార్టీకంటూ ఓటు బ్యాంక్ సమకూర్చుకోవడమే కాకుండా అవినీతి డీఎంకేతో పొత్తు పెట్టుకోనని ప్రగల్భాలు పలికి చివరకు ఆ పార్టీ ద్వారా రాజ్యసభ సీటు పొందటం గర్హనీయమని బీజేపీ ఎమ్మెల్యే వానతి శీనివాసన్ విమర్శించారు. ఈ నెల 22న మదురైలో జరుగనున్న మురుగభక్తుల మహానాడు ప్రచార కార్యక్రమాన్ని కోవైలో ఆదివారం నిర్వహించారు. కమల్‌హాసన్ సినిమా షూటింగ్‌ల సందర్భంగా కెమెరా ముందుకొచ్చి నటించి ఆ తర్వాత కనిపించకుండా పోయేలా అప్పుడప్పు జనం ముందు వచ్చి ఉన్నట్టుండి మాయమవుతుంటారన్నారు. ఎలాగైనా పార్లమెంట్‌లో అడుగుపెట్టి తీరాలని తనను నమ్మి ఓటేసిన ప్రజలకు తీరని ద్రోహం చేసేలా డీఎంకే పంచన చేరారని ఆమె విమర్శించారు.

మురుగన్ ఆలయంలో అన్నాడీఎంకే నేతల ప్రత్యేక పూజలు

తిరుత్తణి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి 71వ జన్మదినాన్ని పురస్కరించుకుని తిరువళ్లూరు జిల్లాలో ప్రసిద్ధి చెందిన మురుగన్ ఆలయంలో అరక్కోణం మాజీ ఎంపీ జి.హరి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ క్రమంలో పార్టీ శ్రేణులతో కలిసి బంగారు రథాన్ని లాగిన ఆయన భక్తులకు అన్నప్రసాదాలు అందజేశారు.




రథాన్ని లాగుతున్న మాజీ ఎంపీ జి.హరి తదితరులు, భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేస్తున్న మాజీ ఎంపీ

కోలాహలంగా కరుప్పుస్వామి ఆలయ వేడుకలు



విందు భోజనంలో పాల్గొన్న పురుషులు

పెరంబూర్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): దక్షిణ జిల్లాల్లో సాధారణంగా ఆలయ వేడుకలు మాంసం విందుతో జరుపుకుంటారు. ముఖ్యంగా, రాత్రి పూట జరిగే విందు భోజనంలో పురుషులు మాత్రమే పాల్గొంటుంటారు. అలాంటి వేడుకల్లో దిండుగల్ జిల్లా నత్తం సమీపం సానార్‌పట్టి పంచాయతీలోని దేత్తాంపట్టి కోట కరుపుస్వామి ఆలయ వేడుకలు ఒకటి. వందేళ్ల ప్రాచీన చరిత్ర కలిగిన ఈ ఆలయంలో వైకాసి నెలలో వేడుకలు నిర్వహిస్తుంటారు. ఈ వేడుకల్లో భక్తులు తాము పెంచే గొర్రెలు, మేకలను బలిచ్చి స్వామి వారికి నైవేద్యంగా సమర్పిస్తుంటారు. ఆ ప్రకారం, శనివారం రాత్రి జరిగిన వేడుకల్లో 560 గొర్రెలు, మేకలు బలిచ్చి వంట చేసి స్వామివారికి నైవేద్యంగా సమర్పించారు. అనంతరం పురుషులు మాత్రమే విందు భోజనంలో పాల్గొన్నారు. ఈ ఏడాది వర్షాలు బాగా కురిసి, పంటలు పండి రైతులకు ఆదాయం రావాలంటూ భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

టాస్మాక్ ఉద్యోగి వద్ద రూ.2.80 లక్షల చోరీ

పెరంబూర్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): టాస్మాక్ ఉద్యోగి వద్ద రూ.2.80 లక్షలు దోచుకెళ్లిన వ్యక్తుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. నాగపట్టణం జిల్లా తిమ్మనాయకన్‌పట్టి టాస్మాక్ దుకాణంలో ముత్తుస్వామి (40) సేల్స్‌మన్‌గా పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి 10 గంటలకు దుకాణం మూసివేసి, విక్రయాల ద్వారా వచ్చిన నగదు తీసుకుని ద్విచక్రవాహనంలో ఇంటికి బయల్దేరాడు. దుకాణం నుంచి కొద్ది దూరం వెళ్లిన సమయంలో, వెనుకగా రెండు ద్విచక్రవాహనాల్లో వచ్చిన నలుగురు వ్యక్తులు, ముత్తుస్వామి బైక్‌ను అడ్డుకొని అతడిపై కత్తితో దాడిచేసి, అతడి బ్యాగులోని రూ.2.80 లక్షలు దోచుకుని పరారయ్యారు. ఆ సమయంలో ఆ మార్గంలో వచ్చిన సహచర ఉద్యోగి బాలమురుగన్, రక్తపు మడుగులో పడిన ముత్తుస్వామిని అంబులెన్స్‌లో రాశిపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై మంగళపురం పోలీసులు కేసు నమోదుచేసి, ఈ ప్రాంతంలోని సీసీ ఫుటేజీ ఆధారంగా అగంతకుల కోసం గాలిస్తున్నారు.

నగల దుకాణంలో చోరీ పశ్చిమ బెంగాల్ వాసి అరెస్ట్

పెరంబూర్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక రాయపేటలోని నగల తయారీ దుకాణంలో బంగారం చోరీచేసిన ఉద్యోగిని పోలీసులు అరెస్ట్ చేశారు. చూళై ప్రాంతానికి చెందిన గౌతమ్ సురానా రాయపేట కెథడ్రల్‌లోని నగల తయారీ దుకాణంలో మేనేజర్‌గా పనిచేస్తున్నాడు. సురానా రాయపేట పోలీస్‌స్టేషన్‌లో అందజేసిన ఫిర్యాదులో... తన దుకాణంలో 2008 నుంచి బాబిహస్రా బంగారు కడ్డీలు తయారుచేస్తున్నాడని, అతను సుమారు 20.9 గ్రాముల బంగారు కడ్డీలు, 102 గ్రాముల కాపర్ కమ్ములు చోరీచేసి గత నెల 23వ తేది నుంచి అదృశ్యమయ్యాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై విచారణ చేపట్టిన పోలీసులు, పశ్చిమ బెంగాల్ రాష్ట్రానికి చెందిన బాబి హస్రాను అరెస్ట్ చేసి, అతని నుంచి 20.9 గ్రాముల బంగారు కడ్డీలు, 102 గ్రాముల కాపర్ స్వాధీనం చేసుకున్నారు.

మన్నార్ ప్రాంతానికి కొట్టుకొచ్చిన నాటుపడవ



చెన్నై, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): శ్రీలంక సమీపం మన్నార్ జలసంధి వద్ద ఓ నాటు పడవ ఆదివారం వేకువజాము కొట్టుకువచ్చింది. ఆ పడవను శ్రీలంక భద్రతాధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఇటీవల రామేశ్వరం నుండి గంజాయి, బీడి ఆకులు, బంగారాన్ని పడవలో అక్రమంగా తరలించే ఘటనలు అధికంగా జరుగుతున్నాయి. ఆ నేపథ్యంలోనే పడవను రాష్ట్రానికి చెందిన జాలర్లు మన్నార్ ప్రాంతం వద్ద విడిచిపెట్టి వెళ్ళి ఉంటారని శ్రీలంక భద్రతాదళం అధికారులు అనుమానిస్తున్నారు.

ఇన్‌స్టాగ్రామ్ ప్రియుడిని నమ్మి చెన్నైకు పోలీసుల రక్షణలో బాలిక

పెరంబూర్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన ప్రియుడి మాటలు నమ్మి చెన్నై వచ్చిన బాలికను పోలీసులు రక్షించారు. తిరువణ్ణామలైకి చెందిన 17 ఏళ్ల బాలికకు చెన్నైకి చెందిన యువకుడు ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయం అయ్యాడు. యువకుడి కోరిక మేరకు ఆ యువతి శనివారం చెన్నై చేరుకుంది. బాలికను సెంట్రల్ రైల్వే స్టేషన్ వద్ద ఉంచి యువకుడు వెళ్లిపోయినట్లు సమాచారం. అతడికోసం వేచి చూస్తున్న బాలిక వద్దకు వచ్చిన ముగ్గురు యువకులు, ఆమెను ద్విచక్రవాహనంలో ఎక్కించుకుని కొత్వాల్ చావిడిలోని ఓ పాడుపడిన భవనం వద్దకు తీసుకెళ్లారు. ఆ సమయంలో అదే ప్రాంతానికి చెందిన యువకుడు వీరిని గమనించి కొత్వాల్ చావిడి పోలీసులకు సమాచారం అందించాడు. పోలీసులు హుటాహుటిన అక్కడకు చేరుకుని బాలికను రక్షించి, ఒక యువకుడిని అదుపులోకి తీసుకుని, పరారైన మరో ఇద్దరి కోసం గాలిస్తున్నారు. బాలికను ప్రభుత్వ హోంకు తరలించారు.

డీఎండీకేతో సంబంధాలు పటిష్ఠం: ఈపీఎస్



కోవై విమానాశ్రయం వద్ద మీడియాతో మాట్లాడుతున్న ఈపీఎస్

చెన్నై, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): తమ కూటమిలోనే డీఎండీకే కొనసాగుతోందని అన్నాడీఎంకే అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) అన్నారు. ఆదివారం కోయంబత్తూరు విమానాశ్రయం వద్ద ఆయన మీడియాతో మాట్లాడుతూ, రెండు పార్టీల మధ్య సంబంధాలు పటిష్ఠంగానే ఉన్నాయని, ప్రత్యర్థులు, కొన్ని ప్రసారమాధ్యమాల వారు రెండు పార్టీల మధ్య చిచ్చుపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని, అవేవీ జరుగవన్నారు. మదురైలో జరిగిన డీఎంకే సర్వసభ్యమండలి సమావేశంలో 27వ తీర్మానంలో ద్రోహపూరిత అన్నాడీఎంకే అని పేర్కొన్నారని, వాస్తవానికి తమిళ ప్రజలకు తీరని ద్రోహం చేసింది డీఎంకేయేనని అన్నారు. పదేళ్ల అన్నాడీఎంకే ప్రభుత్వ హయంలో శాంతి భద్రతలు పటిష్ఠంగా ఉండేదని, గత నాలుగేళ్ల డీఎంకే పాలనలోనే శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని ఈపీఎస్ ఆరోపించారు. మీడియా సమావేశంలో మాజీ మంత్రులు ఎస్పీ వేలుమణి, వేలుచామి, శాసనసభ్యులు అమ్మన్ కే అర్జునన్, కేఆర్ జయరామ్, పీఆర్‌జీ అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్యుల ధర్నా



చెన్నై, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రోగుల సంఖ్యకు తగిన నిష్పత్తిలో డాక్టర్లను నియమించాలని ప్రభుత్వాన్ని కోరుతూ ఆదివారం ప్రభుత్వ వైద్యులు ధర్నా నిర్వహించారు. ఎగ్మూరు రాజరత్తినం స్టేడియం వద్ద ప్రభుత్వ వైద్య సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో జరిగిన ఈ ధర్నాలో సుమారు 200 మంది వైద్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సమాఖ్య నాయకులు మాట్లాడుతూ 2009లో అప్పటి ముఖ్యమంత్రి కరుణానిధి చేసిన ప్రతిపాదన మేరకు వైద్యుల వేతనాలను పెంచాలని కోరారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో పనిచేస్తున్న వైద్యులకు ప్రయాణ భత్యాల కింద రూ.3000లను చెల్లించాలని, రోగుల నిష్పత్తికి తగినట్లు డాక్టర్లను నియమించాలని డిమాండ్ చేశారు.

కాడువెట్టి గురు జీవిత కథతో 'పడైయాండ మావీరా'

వి.గౌతమన్ దర్శకత్వం వహించి నటించిన చిత్రం 'పడైయాండ మావీరా'. రాజకీయ నేత కాడువెట్టి గురు జీవిత కథ ఆధారంగా రూపుదిద్దుకుంది. నిర్మల్ శరవణ రాజ్, ఎస్.కృష్ణమూర్తి సంయుక్తంగా నిర్మించి వీకే ప్రొడక్షన్ పతాకంపై తెరకెక్కించారు. ఈ చిత్రంలో వి.గౌతమన్‌తో పాటు సముద్రఖని, పూజిత, బాహుబలి ప్రభాకర్, శరణ్య పొన్‌వణ్ణన్, సాయిదీనా, మన్సూర్ అలీఖాన్, ఏఎల్ అళగప్పన్, నిళల్‌గళ్ రవి తదితరులు నటించారు. మూవీ ఆడియో, ట్రైలర్ తాజాగా నగరంలో రిలీజ్ చేశారు. నామ్ తమిళర కట్చి కన్వీనర్ సీమాన్, సినీ దర్శకులు పేరరసు, వసంత్ బాలన్, మాజీ ఎమ్మెల్యే గణేష్‌కుమార్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరై ఆడియో రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా చిత్ర హీరో, దర్శకుడు మాట్లాడుతూ, 'ఈ మట్టితో పాటు ప్రజలను ప్రేమించినట్టుగానే చిత్రపరిశ్రమను కూడా అమితంగా ప్రేమిస్తాను. నిజం చెప్పాలంటే చిత్రం గురించి అందులో నటించిన నటీనటులు, టెక్నీషియన్లు మాట్లాడకూడదు.. ఈ చిత్రం ట్రైలర్‌తోపాటు పాటలు వివాదానికి దారి తీశాయి. సినిమా మొత్తాన్ని చూస్తే మీకే అర్థమవుతుంది. ఇది ఒక కులానికి చెందిన చిత్రం కాదు. కులమతాలతో సంబంధం లేకుండా మనిషిగా సినిమా చూస్తే ప్రతి ఒక్కరి ఆత్మ చలిస్తుంది. అలాంటి గొప్పవ్యక్తి 'పడైయాండ మావీరా'. మూడు అడవుల గురించి సినిమాలు తీయాలన్నదే నా జీవితాశయం. వీటిలో ఒకటి స్మగ్లర్ వీరప్పన్ ఉన్న గంధపు చెక్కల అటవీ ప్రాంతం. దీన్ని విజయవంతంగా పూర్తి చేశాను. రెండోది కాడువెట్టి గురు, మూడోది కామ్రేడ్ తమిళరసన్ నివశించిన అటవీ ప్రాంతాలు. ఇందులో ఒకరి గురించి సినిమా తీశాను. మూడోది నా తల్లిదండ్రులు, మాతృభాషకు సంబంధించింది. నా ఆశయాల్లో రెండు సినిమాలు పూర్తి చేశాను. మూడోదాన్ని కూడా విజయవంతంగా పూర్తి చేస్తాను అనే నమ్మకం ఉంది' అని దర్శక హీరో గౌతమన్ అన్నారు.


'పడైయాండ మావీరా' ఆడియో రిలీజ్ దృశ్యం



విజయ్ సేతుపతి చిత్రంలో నటించడం లేదు

- రాధికా ఆప్టే -

'ధోనీ' చిత్రం ద్వారా తమిళ వెండితెరకు పరిచయమైన హీరోయిన్ రాధికా ఆప్టే... ఆ తర్వాత సూపర్‌స్టార్ రజనీకాంత్ సరసన 'కబాలీ' మూవీలో నటించారు. హిందీ, మరాఠీ, తెలుగు భాషా చిత్రాల్లోనూ నటిస్తూ బిజీగా ఉన్నారు. కోలీవుడ్ హీరో విజయ్ సేతుపతి నటించే తమిళ, తెలుగు భాషా చిత్రంలో హీరోయిన్‌గా రాధికా ఆప్టేను ఎంపిక చేసినట్టు వార్తలు వచ్చాయి. వీటిపై ఆమె క్లారిటీ ఇచ్చారు. 'పూరి జగన్నాథ్ దర్శకత్వంలో విజయ్ సేతుపతి హీరోగా నటించే చిత్రంలో నేను నటించడం లేదు. ఈ విషయంపై ఇప్పటివరకు నన్ను ఎవరూ సంప్రదించలేదు. ఈ తరహా ప్రచారం ఎలా సాగిందో నాకు తెలియదు. మీడియాలో వస్తున్న వార్తలు చూస్తుంటే ఒక వైపు నవ్వు, మరోవైపు కోపం వస్తుంది' అన్నారు.

మూడు భాషల్లో 'తిరుమాల్ పెరుమై'

చిత్రజ్యోతి



'తిరుమాల్ పెరుమై' పేరుతో తమిళం, తెలుగు, హిందీ భాషల్లో ఓ సినిమా తెరకెక్కగా, జీ ఓటీటీలో స్ట్రీమింగ్‌కానుంది. కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం గోపాల్ రామ్. తమిళంలో 'తిరుమాల్ పెరుమై', తెలుగులో 'శ్రీ బాలాజీ మహిమ', హిందీలో 'ఓ మై గాడ్ బాలాజీ' అనే పేర్లు ఖరారు చేశారు. డబ్బింగ్ జానకి, శీవిద్య తదతరులు ప్రధాన పాత్రలు పోషించారు. బాలీవుడ్, టాలీవుడ్‌లో అనేక చిత్రాలకు కథ, స్క్రీన్‌ప్లే, సంభాషణలు సమకూర్చిన అనుభవం ఉన్న గోపాల్ రామ్ మంచి కథకుడు కూడా. ఇటీవల ఘన విజయంసాధించిన 'మహారాజా' చిత్రానికి సంభాషణలు సమకూర్చారు. ఆయన సంభాషణలు సమకూర్చిన అనేక చిత్రాలకు అవార్డులు కూడా వచ్చాయి. చిత్రపరిశ్రమలో అత్యున్నత పురస్కారమైన దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు కూడా స్వీకరించారు. ఇపుడు స్వీయ దర్శకత్వంలో 'తిరుమాల్ పెరుమై' పేరుతో తెరకెక్కించిన చిత్రం జీఓటీటీలో త్వరలోనే స్ట్రీమింగ్‌కానుంది.

తనయుడి కోసం ఒకే ఫ్రేమ్‌లో మాజీ దంపతులు

● మనవడికి రజనీ విషెస్

తనయుడు కోసం మాజీ దంపతులైన హీరో ధనుష్, ఐశ్వర్య ఒకే ఫ్రేమ్‌లో కనిపించారు. తన తల్లిదండ్రులతో కలిసి యాత్ర ఒక ఫొటో దిగాడు. ఈ ఫొటోను హీరో ధనుష్ తన ఇన్‌స్టాగ్రామ్ పేజీలో షేర్ చేయగా అది వైరల్‌గా మారింది. తమ పెద్ద కుమారుడు యాత్ర తరమణిలోని అమెరికన్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేయగా, ఈ స్నాతకోత్సవంలో మాజీ దంపతులైన ధనుష్, ఐశ్వర్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారిద్దరూ తమ తనయుడిని ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నారు. దీనికి సంబంధించిన ఫొటోలను ధనుష్ ఇన్‌స్టాలో షేర్ చేశారు. 'యాత్ర.. తల్లిదండ్రులుగా ఈ రోజు మేమిద్దరం ఎంతో గర్వపడుతున్నాం' అని క్యాప్షన్ జోడించారు. ఈ ఫొటోపై నెటిజన్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు, తన మనవడు గ్రాడ్యుయేషన్‌పై సూపర్‌స్టార్ రజనీకాంత్ కూడా హర్షం వ్యక్తం చేస్తూ ట్వీట్ చేశారు. 'నా మనవడు జీవితంలో తొలి మైలురాయిని దాటాడు. కంగ్రాట్స్ యాత్ర కన్నా' అంటూ ట్వీట్ చేశారు. కాగా, 2004లో ప్రేమించి పెళ్లి చేసుకున్న ధనుష్ - ఐశ్వర్య దంపతులకు యాత్ర, లింగా అనే ఇద్దరు కుమారులున్నారు. 18 యేళ్ళ వైవాహిక బంధం తర్వాత వీరిద్దరూ చట్టబద్ధంగా గత 2024లో విడాకులు తీసుకున్న విషయం తెల్సిందే.



ఐశ్వర్య - ధనుష్‌లతో యాత్ర


కీళడి కాలాన్ని 500 ఏళ్లు తగ్గించండి!



కీళడి వద్ద లభ్యమైన తమిళనాగరికతను చాటే వస్తువులు



● కేంద్ర పురావస్తు శాఖ ఒత్తిడి
● తమిళ పరిశోధకులు, పండితుల ఆగ్రహం
● డీఎంకే సర్వసభ్యమండలిలో ఖండన తీర్మానం



పురావస్తు పరిశోధకుడు, మాజీ ఐఏఎస్ అధికారి బాలకృష్ణన్

టి.నగర్, ఆంధ్రజ్యోతి

మదురై సమీపం కీళడి వద్ద పురావస్తు తవ్వకాల్లో లభించిన ప్రాచీన వస్తువులు, నగర నిక్షేపాలను బట్టి అక్కడి తమిళుల నాగరిత కాలాన్ని 2800 సంవత్సరాల క్రితం నాటిదని కాకుండా, 2300 సంవత్సరాలకు పూర్వం నాటివని ప్రకటించాలని, అంటే పరిశోధకులు నిర్ధారించిన కాలంలో 500 యేళ్ళను తగ్గించాలని కేంద్ర పురావస్తు శాఖ ఒత్తిడి చేస్తుండటం పట్ల తమిళ పరిశోధకులు, పండితులు, రాజకీయ నాయకులు తీవ్ర ఆగ్రహం ప్రకటిస్తున్నారు. ఈ ప్రయత్నం చరిత్రను వక్రీకరించడమే అవుతుందని కేంద్ర పురావస్తు పరిశోధనల శాఖపై మండిపడుతున్నారు. ఆదివారం మదురైలో జరిగిన డీఎంకే సర్వసభ్యమండలి సమావేశంలోనూ ఈ విషయమై ఓ తీర్మానం చేస్తూ కేంద్ర ప్రభుత్వం తమిళుల నాగరికతను వక్రీకరించేందుకు ప్రయత్నిస్తున్నదంటూ ఆరోపించారు. ఈ విషయంలో కేంద్రం అనుసరిస్తున్న మొండి వైఖరిని ఖండిస్తున్నట్లు ఆ తీర్మానంలో పేర్కొన్నారు. కీళడి పురావస్తు తవ్వకాలపై విస్తృత పరిశోధన చేసిన ఏఎస్ఐ (ఆర్కియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా)కి చెందిన ప్రముఖ పరిశోధకుడు అమర్‌నాథ్ రామకృష్ణన్ ఆ పరిశోధనలపై సమగ్రమైన నివేదికను భారత పురావస్తు పరిశోధన శాఖకు సమర్పించారు. ఆ నివేదికలో కొన్ని మార్పులు చేయాలంటూ ఆ సంస్థ దానిని తిప్పిపంపింది. ఆ నివేదికను తిప్పి పంపటానికి గల కారణాలను తొలుత వెల్లడించలేదు. కీళడి వద్ద జరిపిన పురావస్తు తవ్వకాల్లో లభించిన వస్తువులన్నింటిని సాంకేతిక పరిజ్ఞానంతోనే అవి యేకాలానికి చెందినవో నిర్ధారించటం జరిగిందని, కనుక ఎలాంటి సవరణలకు తావులేదని రాష్ట్ర పురావస్తు శాఖ ఆ నివేదికను భారత పురావస్తు పరిశోధన శాఖకే తిప్పిపంపింది. తాజాగా ఆ సంస్థ నివేదికలో చేయాల్సిన సవరణలను గురించి ప్రకటిస్తూ కీళడి నగర నారికత కాల నిర్ధారణలో సుమారు 500 సంవత్సరాలను తగ్గించాలని పేర్కొంటూ నివేదికలను రాష్ట్ర పురావస్తు పరిశోధన సంస్థకు మళ్లీ తిప్పి పంపింది.

కేంద్రం దాగుడుమూతలు...

కీళడి పురావస్తు పరిశోధనలపై సమర్పించిన నివేదికల్లోని వివరాలను కేంద్ర పురావస్తు పరిశోధన శాఖ వెల్లడించకుండా రెండేళ్లపాటు వాటిని దాచిపెట్టిందని తమిళ పురావస్తు పరిశోధకులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంలో కేంద్ర ఆడుతున్న దాగుడుమూతల వెనుక అసలు కారణాలేమిటో తెలియటం లేదన్నారు. కీళడి వద్ద తవ్వకాలు ప్రారంభమైన రెండేళ్లలోపే వైగై నది ఒడ్డున అత్యంత ప్రాచీనమైన నగర నిక్షేపాలు లభ్యమయ్యాయి. ఆ సమయంలోనే కేంద్ర పురావస్తు పరిశోధన శాఖ కీళడి తవ్వకాలకు నిధులను నిలిపివేసింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వమే ఆ తవ్వకాలకు నిధులు కేటాయించింది. ఆ తర్వాత కీళడి తవ్వకాలకు సంబంధించి 982 పేజీల నివేదికలను పురావస్తు పరిశోధకుడు అమర్‌నాథ్ రామకృష్ణన్ 2023 జనవరిలో భారత పురావస్తు పరిశోధన శాఖకు సమర్పించారు. రెండేళ్ల తర్వాత ఆ నివేదికలను కొన్ని సవరణలు చేయాలంటూ తిప్పిపంపారు. ఆ తర్వాత ఆయన తన నివేదికలో ఎలాంటి సవరణలు చేయాల్సిన అవసరం లేదంటూ ఆ నివేదికను మళ్ళీ భారత పురావస్తు పరిశోధన శాఖ పంపారు. ఆ నివేదికలలో కీళడిలో నగర నాగరికత 2800 సంవత్సరాలకు ముందు ఆవిర్భవించిందని, ఆ తర్వాత అంటే 2500 సంవత్సరాల్లో ఆ నాగరికత బాగా వ్యాపించిందని సుస్పష్టంగా పేర్కొన్నారు. ఆ విషయాన్ని అంగీకరించడానికి కేంద్ర ప్రభుత్వం ససేమిరా కుదరదంటోంది. కీళడి నాగరికత 2500 సంవత్సరాలకు పూర్వానికి చెందిందంటూ నివేదికలో సవరణలు చేయాలని పట్టుబడుతోంది. రెండు సార్లు ఆ నివేదికను తిప్పి పంపింది. ఇలా ఆ నివేదికను తిప్పిపంపటం వెనుక రాజకీయ దురుద్దేశాలున్నాయా? తమిళుల ప్రాచీన సంస్కృతి వెలుగులోకి రావటం కేంద్రంలోని పాలకులకు నచ్చడం లేదా? ఈ ప్రశ్నలకు రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, పురావస్తు పరిశోధనల నిపుణుడైన బాలకృష్ణన్ సమగ్రమైన వివరణలతో సమాధానమిచ్చారు.



సాంకేతికపరమైన తవ్వకాలు...

కీళడి పురావస్తు తవ్వకాలు ఏ కాలంలో జరిగాయన్నదే ముఖ్యం. ఈ తవ్వకాలు వందేళ్ల క్రితం జరిగి ఉంటే పరిశోధనలు ఇప్పటిలా వెలుగులోకి వచ్చేవి కావు. అయితే ప్రస్తుతం అందుబాటులోకి వచ్చిన సాంకేతిక పరిజ్ఞానంతో తవ్వకాలు జరుగటంతో వస్తున్న ఫలితాలు అందరినీ ఆశ్చర్యపరుస్తున్నాయని బాలకృష్ణన్ చెప్పారు. 1904లో అలెగ్జాండర్ లీ అనే వ్యక్తి ఆదిచ్చనల్లూరులో లభించిన అరుదైన సమాచారాన్ని వెలుగులోకి తీసుకొచ్చారు. ఆ తర్వాత దాదాపు వందేళ్ల వరకు ఆ ప్రాంతం జోలికి ఎవరూ వెళ్ళ లేదు. కీళడి పురావస్తు తవ్వకాలు సాంకేతిక పరిజ్ఞానం బాగా అభివృద్ధి చెందిన తర్వాతే ప్రారంభమయ్యాయని చెప్పారు. మదురై నగరం చుట్టూ తమిళ శిలా శాసనాలు, రాతి, కుడ్య శాసనాలు, తిరుప్పరంకుండ్రం, అళగన్‌కుళం తదితర ప్రాంతాల్లో పలు రకాలు శాసనాలు ఎన్నో లభించాయి. అంతటి ప్రాశస్త్యం కలిగిన ఆ నగరం చేరువగానే తమిళ ప్రాచీన నాగరికతకు అద్దంపట్టేలా జనావాస ప్రాంతాలుంటాయని భావించే అమర్‌నాథ్ రామకృష్ణన్ బృందం తవ్వకాలు జరిపాయని తెలిపారు. ఆ తవ్వకాల్లో ప్రాచీన నిర్మాణాలు, నేల దిగువ నీటి కాలువలు, చేనేత పరిశ్రమకు సంబంధించిన ఆనవాళ్లు, పరికరాలు బయల్పడ్డాయి. ఈతవ్వకాల్లో బయల్పడిన అన్ని రకాల వస్తువుల ప్రసావన సంగసాహిత్యంలో ఉన్నాయని ఆయన వివరించారు.

సింధు నాగరికతతో పోల్చటమే కారణమా?

కీళడి నగర నాగరికతను సింధూ నాగరికతతో పోల్చటాన్ని కేంద్రంలోని పాలకులు సహించలేకపోతున్నారని, ఆ కారణంగానే నివేదికలను తిప్పి పంపారని తమిళ పురావస్తు పరిశోధకులు, చరిత్రకారులు ఆరోపిస్తున్నారు. భారతదేశంలో అత్యంత ప్రాచీనమైనదిగా చెబుతున్న సింధులోయ నాగరికత సుమారు 5వేల సంవత్సరాలకు మునుపటిదని, ఆ నాగరికతకు సంబంధించిన ప్రజలు ఎవరు? ఎలా ఉంటారు?అనే ప్రశ్నలకు ఇంకా సమాధానాలు చిక్కలేదని బాలకృష్ణన్ అన్నారు. సింధు నాగరికత ముగిసిన తర్వాత సుమారు 2800 సంవత్సరాలకు ముందే అంటే కీళడి నగర నాగరికత ప్రారంభమైన సంవత్సరానికి, సింధులోయ నాగరికత ముగిసిన సంవత్సరానికి మధ్య అవినాభావ సంబంధం ఉందని తెలిపారు. అందుకే సింధు లోయ నాగరికత కొనసాగింపే కీళడి నగర నాగరికత అని అంగీకరించడానికి కేంద్రంలోని పాలకులు సిద్ధంగా లేరని ఆరోపించారు. కనుకనే కీళడి నాగరికత కాలాన్ని 2300 సంవత్సరాల నాటివని ప్రకటించాలంటూ ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు. ఈ సవరణను రాష్ట్ర ప్రభుత్వం ఎట్టి పరిస్థితులలోనూ అంగీకరించకూడదని డిమాండ్ చేశారు.


క్లియోపాత్రా కుండ వద్ద బాలకృష్ణన్

సంగ సాహిత్యమే ఆధారం...

సింధులోయ, హరప్పావంటి నాగరికతలతో ఉన్న అతి పెద్ద సమస్య ఏమిటంటే, ఆయా ప్రాంతాల్లో లభించిన ప్రాచీన వస్తువుల ప్రస్తావనతో కూడిన సాహిత్యం అంటూ ఏవీ లేకపోవటం! అక్కడ సాహిత్య శూన్యత ఉన్నట్లు భావించాల్సి ఉంటుంది. అయితే కీళడి తవ్వకాల్లో లభించిన, తాజాగా లభిస్తున్న వస్తువులు సంగ సాహిత్యంలో పేర్కొన్న నగరాల ఆనవాళ్లు, ఆ నగరాల ప్రజలు ధరించిన నగలు, వాడిన పనిముట్లు చాలా వరకు ఉండటం విశేషం. అమర్‌నాథ్ రామకృష్ణన్ రెండు విడతలుగా కీళడి వద్ద తవ్వకాలు నిర్వహించారు. ఆ తర్వాత ఆయనను ఏ కారణాల వలనో బదిలీ చేశారు. 2017లో మూడో దశ తవ్వకాలు ప్రారంభమయ్యాయి. వాటిని నిర్వహించడానికి మరో అధికారి వచ్చారు. ఆ తవ్వకాల్లో ప్రాచీన నాగరికతకు సంబంధించి ఎలాంటి వస్తువులు లభ్యం కాలేదని ప్రకటించి ఆ అధికారి చేతులు దులుపుకున్నారు. ఆ సమయంలోనే కీళడి తవ్వకాలను కొనసాగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నడుం బిగించింది. రాష్ట్రానికంటూ ప్రత్యేక పురావస్తు విభాగాన్ని ఏర్పాటు చేసింది. కీళడిలో జరిగిన నాలుగో విడత తవ్వకాల నుండి పదో విడత తవ్వకాల వరకు నిర్విఘ్నంగా తవ్వకాలను పూర్తి చేసింది. ఆ తవ్వకాల్లో లభించిన అత్యంత అరుదైన ప్రాచీన వస్తువులన్నింటినీ భారతీయులంతా ఒకే చోట వీక్షించేలా మ్యూజియం కూడా ఏర్పాటు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకున్న తర్వాత కీళడి పురావస్తు తవ్వకాలు వేగం పుంజుకున్నాయి. ఈ నేపథ్యంలోనే శివకళై, ఆదిచ్చనల్లూరు, కొడుమనల్, అళగన్‌కుళం, వెప్పకోట ప్రాంతాల్లో జరుగుతున్న తవ్వకాలు కూడా తమిళుల ప్రాచీన నాగరికతను లోకానికి ఎలుగెత్తి చాటనున్నాయి.




పర్యాటక ప్రాంతాల్లో పెరిగిన రద్దీ


ఏర్కాడులో పుష్పప్రదర్శన తిలకిస్తున్న పర్యాటకులు

చెన్నై, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): సేలం జిల్లాలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలయిన ఏర్కాడు, మేట్టూరు డ్యామ్ పార్కు, నామక్కల్ జిల్లాలోని కొల్లిమలై ప్రాంతం ఆదివారం పర్యాటకులతో కిటకిటలాడాయి. సోమవారం పాఠశాలలు పునః ప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ ప్రాంతాల్లో పర్యాటకులు పిల్లలను తీసుకుని పెద్ద సంఖ్యలో విచ్చేశారు. ఏర్కాడులో పుష్ప ప్రదర్శన ముగిసినప్పటికీ ఆ ప్రాంతానికి వచ్చే పర్యాటకుల సంఖ్య తగ్గడం లేదు. ప్రస్తుతం ఏర్కాడు అంతటా చల్లటి వాతావరణం ఉండటంతో పర్యాటకులు అన్ని ప్రాంతాలను సందర్శిస్తున్నారు. అన్నాపార్కు, బోట్‌హౌస్, ఘాట్ రోడ్డు ప్రాంతాల్లో పర్యాటకులు పెద్ద సంఖ్యలో గుమికూడారు. ఇదే విధంగా నామక్కల్ జిల్లాలో అరుదైన మూలికలు మెండుగా కలిగిన కొల్లిమలై ప్రాంతంలోనూ శనివారం మధ్యాహ్నం నుండి పర్యాటకుల సందడి పెరిగింది. ఈ ప్రాంతానికి రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, కేరళ, పుదుచ్చేరి తదితర రాష్ట్రాల నుండి కూడా పర్యాటకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. కొల్లిమలై అంతటా తరచూ జల్లులు పడుతుండటంతో ఆహ్లాదకరమైన వాతావరణం నెలకొంది. ఆకాశగంగ జలపాతం, మాసిలా జలపాతం, నమ్ అరువి, సిట్రరువి తదితర జలపాతాల్లోనూ నీటి ప్రవాహం ఉధృతంగా పడుతుండటంతో పర్యాటకులు స్నానం చేయడానికి బారులు తీరారు. ఇదే విధంగా అక్కడి సరస్సులో బోట్ సవారీ కూడా చేశారు.


కొల్లిమలై సరస్సులో బోట్ సవారీ

మేట్టూరు డ్యామ్ పార్కు.

సేలం జిల్లా మేట్టూరు డ్యామ్ పార్కులోనూ శనివారం సాయంత్రం నుండే పర్యాటకుల సందడి మొదలైంది. ఈ ఉద్యానవనం అందాలను వీక్షించడానికి సేలం జిల్లా నుండే కాకుండా ఈరోడ్, ధర్మపురి జిల్లాల నుండి కూడా పర్యాటకులు వచ్చారు. ఆ డ్యామ్ వద్దే ఉన్న అనైకట్టు మునియప్పన్ ఆలయంలో స్వామివారిని కూడా దర్శించుకున్నారు. ఆ తర్వాత చిన్నారులు ఉద్యానవనంలో ఆటాపాటలతో సందడి చేశారు.


మేట్టూరు డ్యామ్ పార్కులో ఊయల ఊగుతున్న చిన్నారులు


సూర్యోదయం వీక్షించేందుకు వచ్చిన పర్యాటకులు

వేసవి సెలవుల చివరి రోజు ... కన్నియాకుమారిలో పర్యాటకుల సందడి

పెరంబూర్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల చివరి రోజు కావడం, ఆదివారం కూడా తోడవడంతో ప్రముఖ పర్యాటక ప్రాంతం కన్నియాకుమారి పర్యాటకులతో కిటకిటలాడింది. తొలుత సూర్యోదయం వీక్షించేందుకు తెల్లవారుజాము నుంచే భక్తులు త్రివేణి సంగమం ప్రాంతానికి చేరుకున్నారు. కానీ, ఆ సమయంలో ఆకాశం మేఘావృతంగా ఉండడంతో సూర్యోదయం కనిపించక భక్తులు అసంతృప్తికి గురయ్యారు. అనంతరం త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు భగవతి అమ్మవారి దర్శనం చేసుకున్నారు. అక్కడి నుంచి తిరువళ్లువర్ రాక్, వివేకానంద స్మారక మండపాలకు పర్యాటకులు వెళ్లారు. తిరువళ్లువర్ రాక్ నుంచి వివేకానంద స్మారక మండపం మధ్య ఏర్పాటుచేసి అద్దాల వంతెన మీదుగా నడిచి వెళ్లిన పర్యాటకులు, దిగువన సముద్రపు అందాలు వీక్షించారు. కన్నియాకుమారిలోని వివేకానంద కేంద్రం ప్రాంగణంలోని భారత మాత ఆలయం, రామాయణ దర్శన్ ఆర్ట్ ఎగ్జిబిషన్ హాల్, గాంధీ మెమోరియల్ మ్యూజియం, కామరాజ్ మణిమండపం, ప్రభుత్వ మ్యూజియం, లైట్ హౌస్, అక్వేరియం, ఎకో పార్క్, తిరుపతి వెంకటా చలపతి ఆలయం తదితర ప్రాంతాలు పర్యాటకులతో కళకళలాడాయి.

తిరుత్తణి ఆలయంలో ప్రత్యేక పూజలు


స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

తిరుత్తణి, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి మురుగన్ ఆలయంలో షష్ఠి సందర్భంగా ఆదివారం ఉదయం ప్రత్యేక పూజలు ఆలయ అర్చకులు నిర్వహించారు. ఈ నేపథ్యంలో, ఆదివారం సెలవు రోజు కావడంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, కేరళ రాష్ట్రాల నుండి భక్తులు పెద్దసంఖ్యలో ఆలయానికి వచ్చి, స్వామివారిని దర్శించుకున్నారు.